
# హత్య



రంగనాధాన్ని హత్య చేశారన్న వార్త విని అంతా నిర్ఘాంతపోయారు. ఆ సంఘటన జరిగిన అయిదు నిమిషాలకే ఆ ప్రదేశమంతా జనంతో కిటకిట లాడిపోయింది.

బజార్లో సరుకులు కొనుక్కుని ఇంటికి వస్తుంటే మెయిన్ రోడ్డు మీదే చంపేశా రతన్ని.

అప్పుడు రాత్రి ఏడు గంటలు దాటింది. మెయిన్‌రోడ్డయినా స్ట్రీట్ లైట్లు వెలగని కారణంగా చీకటిలో పొంచి ఉండి చంపేశారు. ఎంతో కక్షతో చంపినట్లుగా హృదయ విదారకంగా ఉం దా దృశ్యం. మెడ, కాళ్లు, చేతులు నరికేశారు. శవం రోడ్డు ప్రక్కగా పడి ఉంది. చేతి సంచిలోని సరుకులు రోడ్డు మీద చెల్లా చెదురుగా ఉన్నాయి.

వార్త తెలిసిన పోలీసులు హుటాహుటిన వచ్చారు.

రంగనాధంలాంటి వ్యక్తిని అంతలా చంపారంటే ఎవరూ నమ్మలేకపోతున్నారు. అత నా ఊళ్లో చాలాకాలంగా ఉంటున్నాడు. ఊరు చిన్నది కావడంతో అతను అందరికీ తెలుసు. చిన్న ఉద్యోగం చేసుకుంటూ భార్యా బిడ్డలతో హాయిగా ఉంటున్నాడు. ఒకరి జోలికి పోడు. ఎవరి విషయమూ అతని కక్కర్లేదు. అజాతశత్రువని కూడా పేరు.

మరి ఎవరు చంపి ఉంటారు? ఎందుకు చంపి ఉంటారు? అందరిలోను అనుమానం.

అక్కడ గుమిగూడిన జనంలో రకరకాల అనుమానాలు ప్రవేశించాయి. ఇలాంటి హత్యలకు రెండే రెండు కారణా లుంటాయి. ఒకటి రాజకీయాలు; రెండు అక్రమ సంబంధాలు. అత నసలు రాజకీయాలు జోలికి పోడు. ఎవరితోను అక్రమ సంబంధాలు పెట్టుకున్న దాఖలాలు కూడా లేవు. అయినా రాజకీయాల్లో అయితే పైకి తెలుస్తుంది కాని అక్రమ సంబంధాలు పైకి తెలియవుగా. అంటే ఇత నెంరితోనో అక్రమ సంబంధం పెట్టుకుని ఉంటాడు. కాబట్టి వాళ్ల

తాలూకు మనుషులు ఈ హత్య చేసుంటారని అంతా నిర్ధారణ కొచ్చేశారు. ఈ విషయం గోరంతలై కొండంత అయింది.

రంగనాధం కుటుంబం ఈ సంఘటనకి తట్టుకోలేకపోయింది. మనిషి పోవడమే పెద్ద లోటనుకుంటే దానికి తగ్గట్టు అపవా దొకటి. పోలీసు లడిగే ప్రశ్నలకు ఎవరూ ఏమీ చెప్పలేకపోతున్నారు. ఫలానా వారిమీద అనుమానమని చెప్పడానికి కూడా అవకాశం లేదు.

రంగనాధం భార్య కుమిలి కుమిలి ఏడుస్తోంది. భార్యను, పిల్లల్నీ ఎంతో ప్రేమగా చూసుకునే వాడు రంగనాధం. భార్య క్కూడా భర్తంటే ప్రాణం. అటువంటి భర్త పోవడం ఆమెకు పెద్ద షాక్. అందరూ అనే సూటిపోటి మాటల్ని ఆమె భరించలేకపోతోంది. అంతా- భర్త ఎవరితోనో అక్రమ సంబంధం పెట్టుకున్న కారణంగానే చంపబడ్డా డనటాన్ని జీర్ణించుకోలేకపోతోంది. అయితే భర్తను ఎవరు చంపారు? ఎందుకు చంపారు? ఆమెకూ అంతుబట్టడం లేదు. ఒక వేళ అందరూ అంటున్నదే నిజమా? లేకపోతే ఆయన్ని చంపడానికి ఎవరికి అవకాశం ఉంది. నెమ్మది నెమ్మదిగా ఆమెలో అనుమాన బీజాలు మొలకెత్తాయి. నిజంగా ఆయన్ని దేవు డనుకుంది. కాని తన నింత మోసం చేస్తారని అనుకోలేదు. అతను బ్రతికుండి తనని అలా మోసం చేస్తూ ఉండేకంటే చనిపోవడమే మంచిదేమో అని కూడా ఆమె కనిపించింది.

భర్త చనిపోయిన వారం రోజులకే ఆమెలో నిర్లిప్త భావం బయలుదేరింది. భర్తపోయిన దుఃఖం ఇప్పు డామెలో లేదు. భర్తమీద గతంలో ఉన్న ప్రేమకూడా తగ్గిపోయింది. భర్త తాలూకు ఆనవాళ్లను ఆమె చెరిపెయ్యడానికి ప్రయత్నించింది. పడక గదిలో ఉన్న భర్త ఫోటో తీసేసింది. అప్పుడప్పుడు క్యాంపుల కెళ్లినప్పుడు భర్త రాసిన ఉత్తరాలను చింపి పారేసింది. భర్తతో గడిపిన తీయని స్మృతుల్ని మనసు నుంచి తొలగించేసింది. భర్తపోయిన మొదట్లో పిల్లలు తండ్రి గురించి ఏడుస్తుంటే వాళ్లని పట్టుకుని భోరుమని ఏడ్చేది. కాని ఇప్పుడు వాళ్లు తండ్రి గురించి అడుగుతుంటే వాళ్లని చితక తన్నుతోంది. మొత్తం మీద ఆమె తన భర్తమీద ప్రేమను పూర్తిగా చంపేసుకోవడమే కాక భర్త తనని ఎంత గాఢంగా ప్రేమించేవాడో కూడా మరిచిపోయింది.

అప్పటికి రంగనాధం హత్య జరిగి పది రోజు లయ్యింది. అనుమానించడానికి ఆధారాల్లేక పోలీసులు ఎవర్నీ అరెస్టు చెయ్యలేదు. వాళ్ల ప్రయత్నాలు వాళ్లు చేస్తున్నారు.

పదకొండో రోజున రంగనాధానికి ఇంట్లో కర్మకాండలు జరుపుతున్నారు. బంధు వర్గమంతా వచ్చారు. కర్మకాండలు జరుగుతున్నాయన్న మాటేగాని భక్తితోను, ప్రేమతోను జరుపుతున్నట్లుగా లేవు. ఏదో తప్పనిసరిగా జరుపుతున్నట్లుంది.

అంతలో పోస్టుమాన్ వచ్చాడు. అతని చేతిలో పార్సిల్ ఉంది. అది రంగనాధం భార్య పేరు మీద ఉంది. రంగనాధం భార్య సంతకం చేస్తే ఆ పార్సిల్ అందుకున్నారు. రంగనాధం తండ్రి పార్సిల్ విప్పాడు. అందులో నోట్లకట్టలు! పైన ఉత్తరం ఉంది. అందరూ ఆశ్చర్యంగా, భయంగా ఆ నోట్ల కట్టల వంక చూస్తున్నారు.

ఆ ఉత్తరం రంగనాధం భార్య చదవడం మొదలుపెట్టింది.

"అమ్మా! ఈ ఉత్తరం మీరు చాలా కష్ట కాలంలో ఉన్నప్పుడు రాస్తున్నాం. మీ భర్తను మా వాళ్లు చంపారు. అయితే మీ భర్తపట్ల మాకు ఎటువంటి కోపంగాని, కక్షగాని, శత్రుత్వంగాని లేదు. మాకు రాజకీయంగా అడ్డుతగులుతున్న ఒక వ్యక్తిని చంపాలనుకుని అతని కోసం కాపు కాస్తే ఆ సమయంలో అటు వస్తున్న మీ భర్తను అతనే అనుకుని మా వాళ్లు చంపేశారు. అమాయకుడైన మీ భర్తను అలా చంపడం మాకు చాలా మనస్తాప మయింది. అందులోనూ అక్రమ సంబంధం కారణంగా చంపేశారన్న అపవాదు మాకు చాలా బాధ కలిగించింది. ఆ అపవాదు తొలగించడం కోసమే ఈ ఉత్తరం రాస్తున్నాం. హత్య చేసిన వాళ్లు ఇలా ఉత్తరం రాస్తారా అని అన్పించవచ్చును. కాని రంగనాధంగారి మంచి వ్యక్తిమీద మాకున్న అభిప్రాయం ఇలా ఉత్తరం రాయించింది. మేం రాజకీయ హత్యల్ని ప్రోత్సహించేవాళ్లమయినా మాలో ఉన్న కొద్దిపాటి మానవత్వం ఈ పని చేయించింది. మీకు జరిగిన నష్టాన్ని పూడ్చడం మా వల్ల కాదు. కాని మీ పిల్లలకు అన్యాయం జరగక్కూడదన్న ఉద్దేశంతో ఒక లక్ష రూపాయల్ని పంపిస్తున్నాము. దయ చేసి స్వీకరించండి... మమ్మల్ని క్షమించండి."

ఆ ఉత్తరం చదివిన రంగనాధం భార్య నిశ్చేష్టురాలైంది. ఆమె భర్తపట్ల చేసుకున్న అభిప్రాయాలకు కుంచించుకుపోయింది. ఆమె కళ్ల నిండుగా నీళ్లు. దుఃఖాన్ని ఆపుకోలేక గట్టిగా ఏడ్చేసింది.

"ఏమండీ! మిమ్మల్నెంత అపార్థం చేసుకున్నానండి. వాళ్లెవరో మీ శరీరాన్ని దారుణంగా హత్య చేస్తే నేను అంతకన్నా దారుణంగా మీ ఆత్మను హత్య చేశాను. మీ మీద నమ్మకాన్ని, మన ప్రేమను హత్య చేశానండి. నిజంగా నేనెంత పాపాత్మురాల్ని? మిమ్మల్ని నేనే హత్య చేశాను.... నేనే హత్య చేశాను" అంటూ గట్టిగా అరుస్తూ ఆమె స్పృహ కోల్పోయింది.

